క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

శ్రీకాళహస్తి: పట్టణంలోని తుపాస్ సెంటర్‌లో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు శ్రీకాళహస్తి కోర్టు న్యాయమూర్తులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఉదయం 8.30 గంటలకు మెడికల్ క్యాంపు ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు స్కీం వర్కర్ల ధర్నా

శ్రీకాళహస్తి: రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట బుధవారం సీఐటీయూ అనుబంధ సంఘాల స్కీం వర్కర్లు అధికార, రాజకీయ వేధింపులకు నిరసనగా ధర్నా చేపట్టనున్నారని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య అన్నారు. ప్రతిపక్షంలో ఒకలా అధికారంలో మరోలా వ్యవహరిస్తున్న కూటమి నేతల తీరు తీవ్ర ఆక్షేపణీయమని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటన పేర్కొన్నారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న స్కీమ్ వర్కర్ల గళాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి వినిపించేలా మీడియా మద్దతు ఇవ్వాలన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం


సమావేశంలో మాట్లాడుతున్న సుబోస్

ఏర్పేడు: మానవ అక్రమ రవాణాను అరికడదామని ప్రగతి సంస్థ పాపానాయుడుపేట క్లస్టర్ కన్వీనర్ సుబోస్ అన్నారు. మంగళవారం మండలంలోని కందాడు హైస్కూల్‌లో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలు అక్రమ రవాణాకు గురికాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. మహిళలు, చిన్నారులపై లైంగికదాడులను అరికట్టాలన్నారు. ప్రతి చిన్నారిని కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కనిగిరి ఎమ్మెల్యే


ఆలయ ధ్వజస్తంభం వద్ద కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని మంగళవారం కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమలో ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యమ్మ జాతర

రేణిగుంట: స్థానిక భగత్‌సింగ్ కాలనీలో గ్రామ దేవత సత్యమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేక పూజలు చేసి, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన అంబలి తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహక కమిటీ సభ్యులు సదాశివరెడ్డి, రవి, గోపి, నాగరాజు, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

తిరుపతి లీగల్ : నిత్యం కేసులతో టెన్షన్ పడే న్యాయవాదులు తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు టి.గోపీచంద్ సూచించారు. మంగళవారం తిరుపతి కోర్టు ఆవరణలో సంకల్ప ఆస్పత్రి సహకారంతో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ న్యాయవాదులు ఆరోగ్యంగా ఉండేందుకు హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య రక్షణకు ఈ శిబిరాలు ఉపయోగపడతాయని వెల్లడించారు. క్యాంపులో న్యాయవాదులు, గుమస్తాలకు ఉచితంగా రక్త పరీక్షలు, ఈసీజీ, ఇతర టెస్టు నిర్వహించి రిపోర్టులను అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మార్టిన్ పాల్గొన్నారు.

మత్తు మహమ్మారిపై అవగాహన

తిరుపతి క్రైమ్ : నగరంలోని ఆయుర్వేద కళాశాలలో విద్యార్థులకు మత్తు మహమ్మారి కారణంగా తలెత్తే అనర్థాలపై మంగళవారం అవగాహన కల్పించారు. డీఎస్పీ రవిమనోహరాచారి మాట్లాడుతూ యువత మత్తుకు బానిసలు కాకూడదని కోరారు. ఆధునిక సమాజంలో డ్రగ్స్ వాడకం యువతను నాశనం చేస్తోందన్నారు. ఈ మహమ్మారికి యువత దూరంగా ఉండాలని సూచించారు. అలాగే తోటి విద్యార్థులను గౌరవించాలని, ర్యాగింగ్ పాల్పడకూడదని స్పష్టం చేశారు. నూతన పరిజ్ఞానం ద్వారా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని, దీనికి విద్యావంతులు కూడా బాధితులవుతున్నారన్నారు. నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

అనాథలు.. సృజనవీరులు

నైపుణ్యం.. అభిరుచి ఉండాలే కానీ పనికిరాని వ్యర్థాలను సైతం అందంగా తీర్చిదిద్దవచ్చని నిరూపిస్తున్నారు రేణిగుంటలోని అభయక్షేత్రంలో ఆశ్రయం పొందుతున్న అనాథలు. వారు వ్యర్థాలతో బొమ్మల తయారీలో దిట్టలు. ఆ అనాథలు పనికిరాని ప్లాస్టిక్ వస్తువులతో రకరకాల కళాకృతులు, అద్భుతమైన బొమ్మలను తయారు చేస్తున్నారు. అవి అందంగా ఉండడంతో ఇళ్లలో అలంకరించుకోవడానికి పలువురు వాటిని కొనుగోలు చేస్తున్నారు.




అభయక్షేత్రం బయట ఏర్పాటు చేసిన వాల్ గార్డెన్

- అభాగ్యుల సృజనతో అమూల్యఆకృతులు
- ప్లాస్టిక్ వ్యర్థాలతో అబ్బురపరచే బొమ్మల తయారీ

రేణిగుంట: స్థానిక బిస్మిల్లా నగర్‌లోని అభయక్షేత్రంలో ఆశ్రయం పొందుతున్న అనాథలు, అభాగ్యులు చూడచక్కని తీరిలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించి బొమ్మలు, రంగు దారాలను ఉపయోగించి మిరుమిట్లు గొలిపే గాజులను తయారు చేస్తున్నారు. వారి శ్రమకు తగిన ఫలితంతో నిమిత్తం లేకుండా ఇక్కడకు వచ్చిన వారు వీరు తయారు చేసిన బొమ్మలు, గాజులను ఇష్టంగా కొంటున్నారు.

అంతేకాదు.. ఇక్కడ తయారైన వస్తువులను ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో జరిగే ఈవెంట్‌లోనూ ప్రదర్శించారు. ప్రతిభకు ఏదీ అడ్డురాదని వీరు రుజువు చేశారు. వారి అభిరుచులను ప్రోత్సహిస్తే పరివర్తన చక్కగా కనిపిస్తోందని అభయక్షేత్రం నిర్వాహకురాలు తస్లీమ్ అన్నారు.


అభయక్షేత్రంలో ఆశ్రయం పొందుతున్న అనాథలు తయారు చేసిన బొమ్మలు

ఉచితంగా పాఠ్యపుస్తకాల పంపిణీ

నాగలాపురం: ఇంటర్మీడియట్ విద్యార్థులకు మంగళవారం పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్ రాజు చేతుల మీదుగా ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల హైస్కూల్ ప్లస్‌లో 2024 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థులు చదువు కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టడం జరిగిందని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే చదువు ఒక్కటే మార్గం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాబయ్య, జనార్దనరాజు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లత, ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య, ఉపాధ్యాయులు, సీఆర్పీ శివయ్య పాల్గొన్నారు.


పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న డీవైఈఓ ప్రభాకర్ రాజు

క్రీడలతో ఆత్మవిశ్వాసం

ఏర్పేడు: క్రీడలతో విద్యార్థులకు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని ఎస్ఓఎస్ కుటుంబ బలోపేత కార్యక్రమ లోకేషన్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని నాగంపల్లిలో వైకుంఠపాళి క్రీడలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో పిల్లలు తమ హక్కుల గురించి తెలుసుకుంటారని చెప్పారు. పిల్లల భాగస్వామ్యాన్ని పెంచడానికి వైకుంఠపాళి క్రీడలు ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఓఎస్ బాలల గ్రామం ప్రతినిధి మునిరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.


వైకుంఠపాళిపై అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

మానవాళి మనుగడకు చెట్లే ఆధారం

బుచ్చినాయుడుకండ్రిగ: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, మానవ మనుగడకు చెట్ల ఆధారమని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో విశ్రాంత ఉపాధ్యాయుడు సత్యనారాయణ తన సొంత ఖర్చుతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. చెట్లు లేకపోవడంతోనే వర్షాలు కురవడం లేదని, ఎండ ఎక్కువ ఉందన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచాలని కోరారు. చెట్లను పెంచడంతో పచ్చదనం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

ఆక్రమణలు తొలగించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని ఆక్రమణలు తొలగించాలని మంగళవారం ఎస్ఐ వెంకటనరసింహం ఆక్రమణదారులను ఆదేశించారు. క్రీడా మైదానంలో కొందరు టెంట్‌లు వేసుకుని ఆక్రమించుకుని ఉండడంతో ఎంఈఓ మునిసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఆక్రమణలను తొలగించాలని ఎస్ఐ వెంకటనరసింహానికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్ఐ వెంకటనరసింహం టెంట్‌లను తొలగించి, ఖాళీ చేయాలని ఆక్రమణదారులను ఆదేశించగా, ఖాళీ చేసి వెళ్లిపోతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


ఆక్రమణదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటనరసింహం

తెప్పలపై కుమారస్వామి రాజసం

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న కుమారస్వామి ఆలయంలో జరుగుతున్న ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లకు అలంకార మండపంలో విశేషాలంకరణ చేసి, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ నారదపుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. అక్కడ తెప్పలపై స్వామి అమ్మవార్లను కొలువుదీర్చి పూజలు చేశారు.

తెప్పపై విహరిస్తున్న శ్రీవల్లి, దేవసేన సమేత కుమారస్వామిని భక్తులు దర్శించుకుని పరవశించిపోయారు. ఈ కార్యక్రమంలో ఈఎ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుమారస్వామి పురవిహారం

శ్రీవల్లి, దేవసేన సమేత కుమారస్వామి మంగళవారం ఉదయం రథంపై ఊరేగారు. అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు చేసి, సుందరంగా అలంకరించారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను రథంపై కొలువుదీర్చి రథోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని, కర్పూర నీరాజనాలు సమర్పించారు.


తెప్పపై విహరిస్తున్న కుమారస్వామి(ఇన్‌సెట్) విశేషాలంకరణలో స్వామివారు


రథంపై ఊరేగుతున్న శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, తెప్పోత్సవంలో పాల్గొన్న భక్తులు, తెప్పపై కుమారస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

పాఠశాలల్లో సహపంక్తి భోజనాలు

సత్యవేడు: మండలంలోని పలు పాఠశాలల్లో సహపంక్తి భోజనాలు నిర్వహించారు. విద్యాశాఖ ఆదేశాలతో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుభదిన్ భోజన్(సహపంక్తి) కార్యక్రమాన్ని మంగళవారం సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ఇరుగుళం ఉన్నతపాఠశాల, మాదనపాళెం జెడ్పీ హైస్కూలు, ఏఎంపురం ప్రాథమిక పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు. దాతలు హెచ్ఎం భారతి, సర్పంచ్ శిరీషా, శ్రీనివాసులు రెడ్డి, కరాటే మాస్టర్ భువనేష్ ఆర్థిక సాయం అందించడంతో విద్యార్థులకు వడలు, స్వీట్లు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి. వెంకటేశ్వర్లు, జే. పాండురంగయ్య, వైవీఎల్ కుమార్, మనోహర్ , కృష్ణయ్య, భాస్కర్ , శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో సహపంక్తి భోజనాలు

విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం తిథి భోజన్ సందర్భంగా విద్యార్థులకు పౌష్టికారాన్ని ఎంఈఓ మునిసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు రమణయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మునిసుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ప్రభుత్వం పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఏర్పేడు: విద్యార్థులు బాగా చదువుకుని అన్ని రంగాల్లో రాణించాలని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని ఎండీపుత్తూరు ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా అతిథి భోజనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జాతీయ నూతన విద్యావిధానంతో విద్యార్థులలో అభ్యసనా సామర్థ్యం పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గౌరి, పంచాయతీ కార్యదర్శి లోకముని, ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగలాపురంలో తిథి భోజనం

నాగలాపురం: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో మంగళవారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా విద్యార్థులకు తిథి భోజనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ కలిసి పాఠశాల ప్రాంగణంలో భోజనాలు చేశారు. ఈ కార్యక్రమానికి అక్షర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రేమ్‌కుమార్ దాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాబయ్య, జనార్దనరాజు, ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య పాల్గొన్నారు.


బుచ్చినాయుడుకండ్రిగ: విద్యార్థులకు పౌష్టికాహారం వడ్డిస్తున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం


ఏర్పేడు: విద్యార్థులకు భోజనం అందజేస్తున్న సర్పంచ్ మోహనప్రియ


నాగలాపురంలో సహపంక్తి భోజనం చేస్తున్న విద్యార్థులు

చట్టాలపై అవగాహన అవసరం

తిరుపతి అర్బన్ : చట్టాలపై అందరికీ అవగాహన అవసరమని తిరుపతి అర్బన్ ఇన్‌చార్జి తహశీల్దార్ అశోక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని చెన్నారెడ్డికాలనీలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులకు కట్టుబడి జీవనం సాగించాలని చెప్పారు. ప్రధానంగా కులమతాలకు అతీతంగా ఫ్రెండ్లీ నేచర్‌లో బతుకుబండిని సాగించాలని సూచించారు. ఎవరినైనా కులంపేరుతో దూషిస్తే చట్టపరంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటికి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కులమత విద్వేషాలను సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నరేంద్ర, ఆర్ఐ రామచంద్ర, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ శశికళ, నేతలు రేవతి, రమేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ అశోక్‌రెడ్డి

కేజ్రీవాల్ విడుదలకు డిమాండ్

-విద్యార్థులను అభినందిస్తున్న వీసీ

తిరుపతి కల్చరల్ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను తక్షణమే జైలు నుంచి విడుదల చేయాలని ఆమ్ ఆద్మీ, ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీరుగట్టు నగేష్, రాష్ట్ర కార్యదర్శి కల్లూరి బాలసుబ్రమణ్యం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాంగటి గోపాల్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీపీఎం నగర కార్యదర్శి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ సీఎం కేజ్రీవాల్‌ను బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే జైల్లో నిర్బంధించిందని ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలను దుర్వినియోగం చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ విషయంలో తక్షణమే ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని కేజ్రీవాల్ విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట చలపతి, రాష్ట్ర అధికార ప్రతినిధి కె.చందు, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బి.సునీల్, విద్యార్థి నాయకుడు కిరణ్, యువజన నేత గంగాధర్, డాక్టర్ విభాగం నేత అహ్మద్, యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షుడు వెంకట్ గౌడ్, సీఐటీయూ నేతలు మాధవ్‌కృష్ణ, వేణు, ఏఐటీయూసీ నేత ఎన్‌డీ రవి పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఆమ్ ఆద్మీ, ఇండియా కూటమి నేతలు

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

తిరుపతి తుడా : తిరుపతి రుయాలో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని ఏఐటీయూసీ నేతలు హెచ్చరించారు. కార్మికులను వేధిస్తున్న పారిశుద్ధ్య నిర్వహణ సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు రుయా ఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణకు వినతి పత్రం సమర్పించారు. ఏఐటీయూసీ నాయకులు రాజా, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర మాట్లాడుతూ గత కొంతకాలంగా ఏ వన్ సర్వీసెస్ సంస్థ పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షిస్తోందన్నారు. ఈ సంస్థ నుంచి సబ్ కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తి కార్మికులకు నెలవారీ వేతనాలు ఇవ్వడం లేదని, అధిక పనిభారం మోపుతున్నాడని ఆరోపించారు. దీనిపై ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. 210 మంది పనిచేయాల్సిన చోట కేవలం 90 మందినే నియమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు రూ. 18వేల వేతనం ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ. 12వేల లోపు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు.


వినతిపత్రం అందిస్తున్న సంఘం నేతలు

పవిత్రోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి కల్చరల్: తిరుపతి శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలకు మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. అందులో భాగంగా సాయంత్రం 6 గంటల నుంచి సేనాధిపతి ఉత్సవం, మేదిని పూజ, మృత్సంగ్రహణం, అంకురార్పణ ఘట్టాలు జరిపించారు. బుధవారం యాగశాలలో పవిత్ర ప్రతిష్ఠ, శయనాధివాసం, ఆగస్టు 1న పవిత్ర సమర్పణ, యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 2న యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, ఆలయ ప్రధాన అర్చకుడు ఆనందకుమార్ దీక్షితులు, సూపరింటెండెంట్ సోమశేఖర్ పాల్గొన్నారు.

ప్రజా సహకారంతోనే క్లీన్ తిరుపతి

తిరుపతి తుడా : నగర పరిశుభ్రతకు పెద్దపీట వేశామని, ప్రజలు సంపూర్ణ సహకారం అందిస్తేనే క్లీన్ తిరుపతి సాధ్యమవుతుందని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తో కలిసి కమిషనర్ మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. పారిశుద్ధ్య అమలు, చెత్త సేకరణ,తరలింపును పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఖాళీ స్థలాలలో వ్యర్థాలు, పిచ్చి మొక్కలు ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిచ్చి మొక్కలు తొలగించేందుకు సంబంధిత భూ యజమానులకు, సంస్థలకు వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. మురుగు కాలువల్లో వ్యర్థాలను ప్రతిరోజూ తొలగించాలని స్పష్టం చేశారు. ఖాళీ స్థలాల్లో చెత్త పోసే వారిని గుర్తించి జరిమానా విధించాలని తెలిపారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు రాజీలేని నిర్ణయాలు అమలు చేస్తున్నామన్నారు. అయితే ప్రజలు పూర్తి అవగాహనతో చెత్తపై స్వీయ నియంత్రణ విధించుకోవాలని కోరారు. క్లీన్ చేసిన గంటల వ్యవధిలోనే చెత్తను ఖాళీ స్థలాలు, రోడ్లపై పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానానికి స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. చెత్తను పారిశుద్ధ్య కార్మికులకే అందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈఈలు విజయ్‌కుమార్ రెడ్డి, సంజయ్, మహేష్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.


చెత్త తొలగించాలని ఆదేశిస్తున్న కమిషనర్

కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్సీ

తిరుపతి స్మార్ట్ సిటీ ఎండీగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ మౌర్యను ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మర్యాదపూర్వకంగా కలిశారు.